ప్రజాశక్తి

ఆదివారం 29 జూన్ 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు





పోలీసుల దాడిపై సిట్టింగ్ జడ్జితో విచారణ

- మానవ హక్కుల పరిరక్షణ సదస్సులో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్
- పలు డిమాండ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణకు తీర్మానం

ప్రజాశక్తి - తెనాలి రూరల్



సదస్సులో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి

మానవ హక్కుల పరిరక్షణ కోసం దళిత, ప్రజా సంఘాలు శనివారం నిర్వహించిన సదస్సు విజయవంతమైంది. ఏప్రిల్ 24న ఓ కానిస్టేబుల్ పై దాడి చేశారంటూ నలుగురు యువకులపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిపై విచక్షణారహితంగా దాడి చేయటాన్ని నిరసిస్తూ శనివారం రాత్రి తెనాలిలో సదస్సు నిర్వహించగా సిపిఎం, సిపిఐ, బీఎస్పీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, విసికె, ఆర్పీఐ పార్టీలతోపాటు కెవిపిఎస్, కెఎన్‌పిఎస్, సిఐటియు తదితర ప్రజా సంఘాలు హాజరయ్యాయి. ప్రముఖ న్యాయవాది పిల్లి విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రసంగించారు. తెనాలి ఘటనలో ఎలాంటి కేసులు లేని అమాయకులను పోలీసులు దారుణంగా హింసించారన్నారు. ప్రజాధనాన్ని లూటీ చేసిన విజయ్ మాల్యా, లలిత్ మోడీ దేశభక్తులా అని ప్రశ్నించారు. ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలను సిపిఎం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ ఈ కేసులో పోలీసులు అత్యంత దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. తెనాలితో పాటు అన్ని నియోజకవర్గాల్లో దళితులపై ఇవే తరహా దాడులు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో దళితులపై అణచివేత ధోరణి కొనసాగుతోందని, సనాతన ధర్మం జపం చేస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలోనే దళితులు సంఘ బహిష్కరణకు గురికావడం ఇందుకు నిదర్శనమని చెప్పారు. కంచే చేను మేసిన చందంగా పోలీసులే ప్రజలను హింసకు గురి చేస్తే, సామాన్యులకు న్యాయం ఎక్కడ దొరుకుతుందని ప్రశ్నించారు. పోలీసుల చర్యలను ఖండించాల్సిన ఎస్పీ సమర్థించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమేనన్నారు. ఇలాంటి పరిణామాలను ఐక్య ఉద్యమాల ద్వారానే తిప్పి కొట్టాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కంటే మోడీ రాజ్యాంగం పైనే రాష్ట్ర ప్రభుత్వానికి నమ్మకమన్నారు. ఆ ప్రకారమే విధ్వంసకర పాలన చేస్తున్నారని విమర్శించారు. తెనాలి ఘటనలో బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు ప్రతి పోరాటానికి కాంగ్రెస్ తరపున అండగా ఉంటామని చెప్పారు. రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు చెన్నకేశవులు మాట్లాడుతూ తెనాలి ఘటనపై సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశమని, ఘటనపై ఇప్పటివరకు స్పందించని స్థానిక ఎమ్మెల్యేను మొదటి ముద్దాయిగా చేర్చామని చెప్పారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు ▶ 2లో

జెడ్‌పిలో తొలగని అనిశ్చితి

- 4న సర్వసభ్య సమావేశం నిర్వహణకు సన్నాహాలు
- వైసిపి జెడ్‌పిటిసిలకు టిడిపి గాలం?

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి



ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం 4వ తేదీన నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. మార్చి 15న జరగాల్సిన జిల్లా పరిషత్ సాధారణ సమావేశం కోరం లేక వాయిదా పడింది. తరువాత మార్చి 29న సమావేశం నిర్వహించాలని జిల్లా పరిషత్ సిఈవో జ్యోతిబసు నిర్ణయించినా జిల్లా చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా గ్రూపే వాయిదా వేయించింది. సర్వసభ్య సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరణ బడ్జెట్, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనాల బడ్జెట్‌ను ఆమోదించాల్సి ఉండగా రెండుసార్లు సమావేశం జరగకపోవడంతో జిల్లా కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలను నేరుగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు పంపారు. ప్రభుత్వం నేరుగా బడ్జెట్ ఆమోదం తెలిపి జిల్లాకు వివరాలు పంపింది. మార్చి 15 తరువాత ఇంత వరకు సమావేశం జరగలేదు. ఈ నేపథ్యంలో వచ్చేనెల 4న సమావేశం నిర్వహణకు చైర్‌పర్సన్, సిఈవో కలిసి నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు.

అయితే ఈ సమావేశానికి వైసిపి వారు వస్తారా? లేదా బహిష్కరిస్తారా అనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదు. రెండు రోజుల్లో వైసిపి ఉమ్మడి జిల్లా జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు కలసి నిర్ణయం తీసుకుంటారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. జిల్లా పరిషత్ సమావేశం జరగాలంటే కోరం ఉండాలి. జిల్లా పరిషత్ సమావేశంలో మొత్తం 54 మంది జెడ్‌పిటిసిలు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, కోఆప్షన్ సభ్యులు కలిపి మొత్తం 83 మంది ఉన్నారు. కోరం ఉండాలంటే మూడో వంతు 28 మంది ఉండాలి. టిడిపికి చైర్‌పర్సన్‌తోపాటు 11 మంది జెడ్‌పిటిసిలు ఉన్నారు. మొత్తం 56లో వైసిపికి ప్రస్తుతం 44 మంది ఉన్నారు. గతనెల 15న జరిగిన సమావేశంలో వైసిపి వారంతా మూకుమ్మడిగా గైర్హాజరు కావడంతో కోరం లేక వాయిదా వేశారు. టిడిపి వారితోనే సమావేశం నిర్వహించాలంటే 12 మంది జెడ్‌పిటిసిలతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిల్లో మరో 16 మంది హాజరు కావాల్సి ఉంది. ఒకేసారి టిడిపి నుంచి ఇంత మంది ప్రజా ప్రతినిధులు హాజరు కావడంపై సందిగ్ధత నెలకొంది. ఒక వేళ టిడిపి సభ్యులే కోరానికి అవసరమైన సంఖ్యలో హాజరైని వైసిపి వారు మూకుమ్మడిగా ప్రభుత్వంపై విమర్శలు దాడి చేసే అవకాశం ▶ 2లో

ధరలు పెంచినా జీతం మాత్రం పెంచలేదు

- మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై దశలవారీ ఆందోళనలు : మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - తాడేపల్లి

డీజిల్, పెట్రోల్, ఇతర నిత్యావసరాలను మూడేళ్లుగా అనేక రెట్లు పెంచిన ప్రభుత్వం... మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు మాత్రం పెంచలేదని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు విమర్శించారు. తాడేపల్లి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు రూ.18,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్‌లు సాధించేవరకు దశల వారి ▶ 2లో



కార్మికులతో ఉమామహేశ్వరరావు, సిఐటియు నాయకులు



3 నెలల్లో విజయవాడ వెస్టు బైపాస్ పూర్తి

త్వరలో గుంటూరు-వినుకొండ రోడ్డు విస్తరణ పనులు - ప్రభుత్వ పథకాల అమలుపై కేంద్ర మంత్రి సమీక్ష

అప్పు ఇచ్చిన వ్యాపారి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - మాచర్ల

అప్పు తీసుకున్న ఎరువుల వ్యాపారి సకాలంలో డబ్బులు ఇవ్వకపోవటంతో అప్పు ఇచ్చిన మరో ఎరువుల వ్యాపారి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన ఒక వ్యాపారి మరో వ్యాపారికి సరుకు అప్పుగా ఇచ్చాడు. తీసుకున్న వారు డబ్బు ఇవ్వకపోవడం, తరచూ వాయి దాలు వేస్తుండడం, పెట్టుబడి పెట్టిన వ్యాపారి తాను తెచ్చిన చోట నుండి చెల్లించాలనే వత్తిడి పెరగడంతో సతమతమ య్యారు. మూడ్రోజుల కిందట తనకు డబ్బులు ఇవ్వాలని గట్టిగా అడిగినా మరోసారి వాయిదా వేయడంతో తట్టుకోలేని వ్యాపారి తన వెంట తెచ్చుకున్న క్యాన్‌లోని పెట్రోలును వంటిమీద పోసుకో వటంతో ఉద్రిక్తత తలెత్తింది. సమీపంలోని వ్యాపారులు కలుగజేసుకుని ఇద్దరికీ నచ్చజెప్పడంతో అప్పటికి విషయం సద్దుమణిగింది.

ప్రస్తుతం వ్యాపార రంగం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. వ్యాపారాలు సరిగా లేక, డబ్బులు సర్దుబాటవ్వక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని వ్యాపారాలు, 50 శాతం, మరికొన్ని వ్యాపారాలు 25 శాతం పడిపోయాయి. వ్యాపారంలో అప్పులు ఇవ్వటం వసూలు చేసుకోవటం సహజమైన ప్రక్రియ. వ్యాపారి తనకు అవసరమైన పెట్టుబడిని బ్యాంక్‌ల దగ్గర, ఇతరుల దగ్గర సేకరించి తన ఖాతాదారులుకు అప్పులు ఇస్తుంటారు. అయితే అప్పులు తీసుకున్న వారు సకాలంలో తిరిగివ్వలేకపోవడం, అప్పులు తెచ్చుకున్న వ్యాపారులు సమాధానం చెప్పలేకపోవడం వంటి పరిస్థితులు వారిలో మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. ఈ క్రమంలో కొందరు ఐపిలు పెడుతుంటే, మరికొందరు ఆస్తులమ్ముకుంటున్నారు. కొందరు తమ షాపులు ఖాళీ చేసి వెళుతుండగా అవి మళ్లీ భర్తీ అవ్వక ఖాళీగా ఉంటున్నాయి.

నేడు అవగాహన సంస్థ ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లోని సంస్థ కార్యాలయంలో నేడు ఉదయం 11 గంటలకు వయసు రీత్యా ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలు, వ్యాధులపై ఆరోగ్య సభ నిర్వహిస్తున్నట్లు అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సభలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రావిళ్ళ శ్రీగీత ప్రధాన వక్తగా పాల్గొంటారని, వయస్సు రీత్యా వస్తున్న వ్యాధులు, బీపీ, షుగర్, థైరాయిడ్ లాంటి సమస్యలను ఎలా ఎదుర్కోవాలి, జీవనశైలి ఎలా మార్చుకోవాలి వంటి అనేక విషయాలను వివరిస్తారన్నారు. కావున ఆరోగ్యాభిలాషులందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

ఉద్యోగుల సేవలు అమూల్యం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తూ పదవి విరమణకు దగ్గర పడుతు బీసీ ఉద్యోగులకు బీసీ ఉద్యోగ సంఘ నాయకులు శనివారం నాడు వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు మహాత్మ జ్యోతిరావు పూలే సెంటర్ డైరెక్టర్ ఆచార్య ఆర్ త్రిమూర్తి రావు సభా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ వీరయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో త్రిమూర్తి రావు మాట్లాడుతూ పదవీ విరమణకు దగ్గరపడిన బీసీ ఉద్యోగులు విధులు నిర్వర్తించడంలో, బీసీ ఉద్యోగ సంఘంలో వారు నిర్వర్తించిన బాధ్యతలు మరువ లేనివని కొనియాడారు. ముఖ్యఅతిథిగా వచ్చిన సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ వీరయ్య మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉద్యోగులుగా వారి బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసే వీరు వన్నె తెచ్చారన్నారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగ సంఘ నాయకులు సిహెచ్ సాంబశివరావు ఐ. సాయిరాం నోడల్ ఆఫీసర్ ఆర్, ప్రకాష్ డి ఈ వెంకటేశ్వరరావు, భానుప్రకాష్ సూర్య కామేశ్వరి, ఏ ఆర్, కాశయ్య ఎన్ శ్రీనివాసరావు షకీలా బేగం విష్ణు కోటి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ఆక్రమణల తొలగింపు

- మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలో ట్రాఫిక్ సమస్య అధిగమించేందుకు రోడ్డుకి ఇరువైపుల ఆక్రమణల తొలగింపు చేపట్టనున్నామని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి తెలిపారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ అధ్యక్షతన జరిగింది. 24 అంశాలతో కూడిన ఎజెండా కౌన్సిల్ ముందుంచి 23 అంశాలను తీర్మానం చేశారు. సదావర్తి సంఘానికి 20 సెంట్లు స్థలం కేటాయింపు అంశం వాయిదా వేశారు. కోర్టు తీర్పు అనంతరం తీర్మానం చేసి స్థలం కేటాయిస్తామని తెలిపారు. కొన్ని నెలలుగా కౌన్సిలర్లకు గౌరవ వేతనం ఇవ్వడం లేదని, పదవీకాలం 8 నెలలు మాత్రమే ఉందని గౌరవ వేతనం ఇచ్చి కౌన్సిలర్లను గౌరవించాలని కౌన్సిలర్ బ్రహ్మయ్య, భాష మరి కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. జరుగుతున్న అభివృద్ధి పనులు ఆగకుండా పనులు పూర్తి చేయాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ మెరుగుదలకు సహకరించాలి

ప్రజాశక్తి-గుంటూరు



గుంటూరు రూరల్ మండలం, గొర్లవారిపాలెం పంచాయతీని జిల్లా పంచాయితీ అధికారి సందర్శి ంచారు. గ్రామంలో ఇంటింటి నుండి తడి, పొడి చెత్తసేకరణ గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకోవడం జరిగినది. షాపు యజమానులతో మాట్లాడి పారిశుధ్యం పై తగు సూచనలు చేశారు. గ్రామంలోని పారిశుధ్య వ్యవస్థ, ఓహెచ్ఎస్ఆర్ వద్ద క్లోరినేషన్ విధానం, ట్యాంక్ క్లీనింగ్ విధానం పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లు సందర్శించి నిర్వహణ విధానంపై పంచాయతీ కార్యదర్శికి తగు సూచనలు చేశారు. ప్రతిరోజు ఇంటింటి నుండి చెత్తను సేకరించు పారిశుధ్య సిబ్బందికి గ్రామస్తులు సహకరించి గ్రామంలో సీజనల్ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిపిఒ నాగసాయికుమార్ ప్రజలను కోరారు. అనంతరం గుంటూరు రూరల్ మండలంలోని వెంగళాయపాలెంలో ట్రైనింగ్ సెంటర్‌ను డిపిఒ సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బండి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, వెంగళాయపాలెం సర్పంచ్ నల్లపాటి లలితకుమారి పాల్గొన్నారు.

3 నెలల్లో విజయవాడ వెస్టు బైపాస్ పూర్తి

త్వరలో గుంటూరు-వినుకొండ రోడ్డు విస్తరణ పనులు

ప్రభుత్వ పథకాల అమలుపై కేంద్ర మంత్రి పెమ్మసాని సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మంగళగిరి మండలం కాజ నుంచి ఏలూరు జిల్లా గుండుగొలను వరకు జాతీయ రహదారికి అనుసంధానంగా నిర్మిస్తున్న విజయవాడ వెస్టు బైపాస్ రహదారిని మూడు నెలల్లోగా పూర్తి చేస్తామనికేంద్ర గ్రామీణ అభివద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి అభివద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశంలో ఆయన సమీక్ష చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విజయవాడ వెస్ట్ బైపాస్ 93 శాతం పూర్తయిందన్నారు.

సెప్టెంబర్ చివరి కల్లా 100 పూర్తి చేస్తామన్నారు. ఎయిమ్స్ ఆస్పత్రికి గుంటూరు నుంచి డౌన్ వార్డు ర్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు పనులు త్వరలో ప్రారంభం అవుతాయన్నారు. వినుకొండ - గుంటూరు నేషనల్ హైవే - 544డి టెక్నికల్ గా పూర్తి అనుమతులు సిద్ధమయ్యాయన్నారు. గుంటూరు - నిజాంపట్నం పోర్టు కనెక్టివిటీ పనులు అలైన్మెంట్ అప్రూవల్ వచ్చాయన్నారు. ఈ రెండు పనులకు సంబంధించిన పనులను ఢిల్లీ నుంచి ఫాలోఅప్ చేయాల్సి ఉంటుందన్నారు. అసంపూర్తిగా ఉన్న నందివెలుగు ఆర్ ఓ బి టెక్నికల్ అనుమతులు పూర్తయ్యాయని త్వరలో పనులకు టెండర్లు పిలుస్తారన్నారు. లి ఇన్నర్ రింగ్ రోడ్డు నెంబర్ 6 పేరేచర్ల ఈ రెండు కూడా నెల నెలన్నరలో టెక్నికల్ శాంక్షన్ పూర్తికావస్తున్నాయి. గుంటూరు నెహ్రూనగర్, సీతానగరం వద్ద ఆర్‌వోబిలపై పరిశీలన జరుగుతుందన్నారు. గుంటూరులో అమత్ టు స్కీం టెండర్స్ ఆహ్వానించారు. జులై 21 కల్లా టెండర్ దశ పూర్తి చేసి, ఆగస్టు కల్లా పనులు ప్రారంభమవుతాయన్నారు. అమత్ 1 గోరంట్ల వాటర్ స్కీం గత ఐదేళ్లలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. వాళ్లు తిరిగి వచ్చే అవకాశం లేనందున, నూతన కాంట్రాక్టర్ తో పనులు ప్రారంభించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. జలజీవన్ మిషన్ రూ. 600 - 700 కోట్లు బిల్లులు పెండింగ్లో ఉన్నాయన్నారు. ఈ పథకం పనులు, పెండింగ్ నిధులు ఏ విధంగా నిర్ణయాలు తీసుకోవాలని రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రితో చర్చిస్తున్నామన్నారు. జిల్లాలో సూర్య ఘర్ కు 1.10 లక్షలు రిజిస్టర్ అయ్యారు. అందులో సుమారు పదివేలకు పైగా సోలార్ ఏర్పాటు చేయడమైనది. కొంత మంది

బ్యాంకర్స్ నుంచి వస్తున్న ఇబ్బందులను పరిష్కరించాల్సి ఉందన్నారు. ప్రారంభ పెట్టుబడిని కూడా పెట్టుకోలేని వారి పరిస్థితిని దష్టిలో ఉంచుకొని కేంద్రస్థాయి నుంచి ఏదైనా పరిష్కారం దొరుకుతుందేమో ప్రయత్నిస్తామన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్స్ మన పార్లమెంట్ లో దాదాపు 6 లక్షలు పూర్తయ్యాయన్నారు. ఇంకా 3 లక్షలు కార్డ్స్ తీసుకోవచ్చు. మిషన్ మోడ్ లో 1-2 నెలల్లో పూర్తి చేస్తామన్నారు. జగనన్న కాలనీలో అన్ని కుంభకోణాలు జరిగాయన్నారు. స్థలాల కొనుగోలులో పెద్దఎత్తున అవినీతి జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం గురించి పట్టించుకోలేదన్నారు. అంతకు ముందు జాతీయ రహదారుల ప్రాజెక్టులు, ఆర్వోబీలు, ఆర్ యూ బీలు, అమత్ పథకం, జల్ జీవన్ మిషన్, అయూష్మాన్ భారత్ , సూర్య ఘర్, ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం అమలు తీరుపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి సూచనలు అందించారు.జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకంకు సత్వరమే రుణాలు మంజూరు చేసేలా బ్యాంకర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకంలో అనర్హులను గుర్తించేందుకు ప్రత్యేకంగా సర్వే నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో త్రాగునీటి పథకం ఫిల్టరేషన్ ప్లాంట్ లు శుభ్రపరచాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకం యూనిట్ల ఏర్పాటుకు పిపిపి పద్దతిలో చర్యలు తీసుకోవాలన్నారు. శాసన సభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ జాతీయ రహదారి టోల్ ప్లాజా వద్ద ప్రజా ప్రతినిధుల వాహనాలకు క్యూలైన్ లో కాకుండా ప్రత్యేకంగా దారిని ఏర్పాటు చేయాలన్నారు. జల్ జీవన్ మిషన్ పనులు గత ప్రభుత్వ హయంలో నియోజకవర్గంలో అస్తవ్యస్తంగా జరిగాయని, దీనిపై పూర్తి స్థాయిలో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించాలన్నారు. శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ అమత్ 1.0 లో మంజూరు చేసిన గోరంట్ల రిజర్వాయర్ పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం ఇళ్ళ నిర్మాణానికి లే అవుట్ లకు సేకరించిన భూములలో నిరుపయోగంగా ఉన్న వాటిని తిరిగి వినియోగించుకునేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించాలన్నారు. ప్రదాన మంత్రి అవాస్ యోజన పథకం పనులలో జరిగిన అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలన్నారు. జడ్పీ చైర్ పర్సన్ కత్తెర క్రిస్టియానా, ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మునిసిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల దాడిపై సిట్టింగ్ జడ్జితో విచారణ

(మొదటిపేజీ తరువాయి)



మాట్లాడుతూ ఉద్యమాల పురిటి గడ్డ తెనాలిలో పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత హేయమైన చర్యగా వర్ణించారు. ఇలాంటి ఘటనలపై ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాడాలన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలన అవసరమన్నారు. ప్రపంచ దేశాల్లో భారత రాజ్యాంగం గొప్పదని, దానిని అవహేళన చేసే విధంగా పాలన ఉందని, ఇలాంటి పరిణామాలను సమిష్టిగా అడ్డుకోవాలని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకరరావు మాట్లాడుతూ కేసు పూర్వపరాలను పూర్తిగా వివరించారు. పోలీసులు దళిత మైనార్టీ యువకులపై వాసవికంగా వ్యవహరించిన తీరును వివరించారు. సభకు అధ్యక్షత వహించిన విద్యాసాగర్ మాట్లాడుతూ ఈ ఘటనలో పోలీసులు కచ్చితంగా దోషులేనని, అందుకు సంబంధించిన సాక్ష్యాలన్నీ కోర్టులో సమర్పిస్తామని అన్నారు. ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, టూ టౌన్ సిఐ రాముల నాయక్, త్రీ టౌన్ సిఐ ఎస్ రమేష్‌బాబు, ఘటనతో ప్రమేయం ఉన్న కానిస్టేబుల్స్‌పై కేసు నమోదు చేసి ఉద్యోగాల నుంచి తొలగించాలని, పోలీసులకు వత్తాసు పలికిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని, పోలీసుల అత్యుత్సాహాన్ని సమర్ధించిన హోం మంత్రిపైనా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉద్యమ కార్యాచరణ కొనసాగించాలని తీర్మానించారు. సదస్సులో బుద్ధిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు ఎంద్రపాటి అశోక్, కొరివి వినయ్‌కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, కార్యదర్శివర్గసభ్యులు ఎన్.భావన్నారాయణ, నాయకులు ఎం.శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలి, జె.బాలరాజు, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.శాంతకుమార్, ఎస్ఎన్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పి.మురళి కుమార్, బీఎస్పీ నాయకులు వాసు, బి.సునీల్, విహెచ్‌పిఎస్ నాయకులు రాయప్ప పాల్గొన్నారు.

జెడ్‌పిలో తొలగని అనిశ్చితి

(మొదటిపేజీ తరువాయి)

ఉండటంతో జిల్లాకు చెందిన టిడిపి ప్రజా ప్రతినిధులు ఎవ్వరూ చొరవ తీసుకోవడంలేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వైసిపి జెడ్‌పిటిసిలకు టిడిపికి చెందిన ఎమ్మెల్యేలు గాలం వేస్తున్నారని తెలిసింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీరును మెజార్టీ జెడ్‌పిటిసిలు వ్యతిరేకిస్తున్నారు. వైసిపి తరుఫున జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా గెలిచి టిడిపిలోకి వెళ్లారని, ఇప్పుడు తమను ఇబ్బంది పెడుతున్నారని వైసిపి వారు ఆమెపై గుర్రుగా ఉన్నారు. దీంతో 4న జరిగే సమావేశంపై ఉత్కంఠ నెలకొంది. గత 100 రోజులుగా నెలకొన్న ప్రతిష్టంభన తొలుగుతుందా? కొనసాగుతుందా? అనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ధరలు పెంచినా జీతం మాత్రం పెంచలేదు

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళనలు చేపడతామన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. 17 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. పదేళ్ల పనిచేసిన మున్సిపల్ కార్మికులకు రూ.75000 ఇస్తామని, అక్కడి నుండి ప్రతి సంవత్సరం రూ.2000 చొప్పున పెంచుతామని ఇచ్చిన జీవోను అమలు చేయాలని, చనిపోయిన కార్మికుల మట్టి ఖర్చుల మొత్తాన్ని రూ.15 వేల నుండి రూ.20 వేలకు పెంపు, రిటైరైన వారికి రూ.5 లక్షల నుండి రూ.7 లక్షలకు పెంచి ఇస్తామనే వాగ్దానాలను అమలు చేయాలన్నారు. ఆప్కాస్ రద్దు చేస్తే మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ అయిన వారి స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఈ సమస్యల న్నిటిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, కార్మిక ప్రతినిధులతో చర్చలు జరపాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఒకటో తేదీన అన్ని పట్టణాల్లో కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసనలు తెలుపుతారని, నాలుగో తేదీన విజయవాడలో భారీ ధర్నా చేస్తామని చెప్పారు. అప్పటికి ప్రభుత్వం దిగిరాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వర్లు, కార్మికులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

లాలపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గల రౌడీ షీటర్లకు గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ డిఎస్‌పి అబ్దుల్ అజీజ్ శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లంతా తమ పద్ధతి మార్చుకోవాలన్నారు. నేరాలకు పాల్పడిన, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించినా పిడి యాక్టు పెట్టి జైలుకు పంపుతామన్నారు. నేర ప్రవత్తిని మానుకొని, సమాజంలో ప్రజానీకంతో మంచిగా మెలగాలని తెలిపినారు.లాలాపేట సిఐ ఏవీ శివ ప్రసాద్, ఎస్ఐలు షేక్ హసీమ్, ప్రవీణ్, విజయకుమార్, బాలా నాయక్ పాల్గొన్నారు.



200 గ్రాముల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గంజాయి విక్రయించే వ్యక్తిని అరెస్టుచేసి 200 గ్రామాలు సరుకు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మారయ్యబాబు శనివారం తెలిపారు. స్థానిక స్తంభాల గరువుకు చెందిన అక్కి గోపి అనే వ్యక్తిని అరెస్టు చేసి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎక్సైజ్ సిఐ బి.నయనతార కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెనాలి పవర్ లిఫ్టర్‌కు కాంస్య పతకాలు

ప్రజాశక్తి- తెనాలిరూరల్



కర్ణాటక రాష్ట్రంలోని ధావన్గిరిలో జూన్ 22 నుండి 30 వరకు జరుగుతున్న జూనియర్ నేషనల్ ఎక్విప్ట్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీలో ఆంధ్రప్రదేశ్ తరపున గుంటూరు జిల్లా తెనాలి చెందిన షేక్ షబీన కాంస్య పతకం సాధించినట్లు గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని సం యుక్త ప్రకటనలో తెలిపారు. 84కిలోలు జూనియర్ విభాగంలో స్క్వాట్ 202.5 కిలోలు, బెంచ్ ప్రెస్ 97.5కిలోలు, డెడ్ లైట్ 182.5కిలోలు మొత్తంగా 482.5కిలోలతో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. గుంటూరు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆర్.ఎన్ వంశీకష్ణ, సౌత్ ఇండియా ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, అధ్యక్షులు వెంకటేశ్వరరావు అభినందనలు తెలియజేశారు.

పొగాకు వాడకం ప్రాణాంతకం

ప్రజాశక్తి - దుగ్గిరాల

పొగాకు ఉత్పత్తుల వాడకం వలన ప్రాణాంతక జబ్బుల బారిన పడే అవకాశం ఉందని యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని స్థానిక పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ఇజాస్ అబ్దుల్ రెహమాన్ విద్యార్థులను కోరారు. ప్రపంచ పొగాకు వాడక వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు పొగాకు ఉత్ప త్తుల వాడకం వలన జరిగే దుష్పరిణామాలు గురించి వివరిం చారు. ముఖ్యంగా క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు. అనంతరం ఈ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు డిపార్టుమెంట్ బ్యాగులు అందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కె శ్రీనివాసరావు ప్రధానోపాధ్యాయురాలు ఎం జయరత్న రాణి పీహెచ్సీ సిబ్బంది బి సుబ్బారావు ఖాన్ విమల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంప్లాయిమెంట్ పాస్ కార్డ్ పోయినది

విజయవాడ గురునానక్ కాలనీకి చెందిన గుర్రం అప్పా రత్నకుమారి w/o ధర్మారావు అను నేను ఆర్టీసీ లో కండక్టర్ గా విధులు నిర్వర్తించి రిటైర్ అయినాను. ఆర్టీసీ వారు నాకు ఎంప్లాయిమెంట్ పాస్ కార్డు ఇచ్చియున్నారు. నేను నా పుట్టిల్లు తుళ్లూరు వచ్చి తిరిగి విజయవాడకు బస్ లో వెళు తుండగా రిటైర్డ్ ఎంప్లాయిమెంట్ పాస్ కార్డు పోయినది. **కార్డు నెంబర్ 20178** దొరికినవారు 9505408645 ఫోన్ నెంబర్ కు తెలియజేయ మనవి.

మీడియాపై దాడి అమానుషం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన దుర్మార్గాలను ప్రజలకు తెలియజేస్తున్న మహా న్యూస్ టివి ఛానల్ పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న మీడియాపై దాడి అమానుషమని, దాడి చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవా లన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం సులభతరం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగ పరచుకోవాలని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి తెనాలి మండల న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు డి శ్రీనివాసులు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ ఎం శ్రీధర్ మాట్లాడుతూ కక్షిదా రులు న్యాయవాదుల సమన్వయంతో కేసుల్లో సరైన న్యాయం, సత్వర న్యాయం పొందాలన్నారు. జూనియర్ డివిజన్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ ఆకా పవన్ కుమార్, జూనియర్ డివిజన్1వ అదనపు సివిల్ జడ్జి పి వివేక్ వర్ధన్, జూనియర్ డివిజన్ 2 వ అదనపు సివిల్ జడ్జి పి రాజశేఖర్, లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయం సూపరింటెండెంట్ మెహబూబ్ పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల : వర్షాకాలం వస్తుంది దోమల బారిన పడకుండా అప్ర మత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి తలాట మురళీ కృష్ణ సుబ్బరాయణం అన్నారు. దుగ్గిరాలలో శనివారం విద్యార్థులకు దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవ గాహన కల్పించారు. నీటి నిలువలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మలే రి యా సబ్‌యూనిట్ అధికారి వి.పున్నారెడ్డి డాక్టర్ ఇజాద్ అబ్దుల్ రెహమాన్, శ్రీనివాసరావు కృష్ణ ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-తెనాలి : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెనాలి త్రీ టౌన్ ఎస్‌హెచ్ఓ ఎస్ రమేష్‌బాబు అన్నారు. సైబర్ క్రైమ్ నెరలపై శనివారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద పాదచారులు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. తమ బ్యాంకు ఖాతా వివరాలను, ఆధార్ కార్డు, పాన్‌కార్డు వివరాలు, ఓటిపిలు ఎవరి కి తెలియజేయవద్దని వృద్ధులు మహిళలకు, విద్యార్థులకు సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాల న్నారు. కార్యక్ర మంలో మూడవ పట్టణ పోలీసు సిబ్బంది పాల్గున్నారు.

చెత్త రకాలపై క్లాప్ మిత్రలు అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

చెత్త రకాలపై క్లాప్ మిత్రలు అవగాహన కలిగి ఉండాలి అని ఎంపీడీఓ శివపార్వతి అన్నారు. శనివారం ఉదయం ఇంటి చెత్త సేక రణ జరుగు విధానాన్ని ఆమె కార్యదర్శి శ్రీని వాసరావుతో కలిసి పరిశీలించారు. క్లాప్ మిత్రు లకు చెత్త సేకరణపై తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలనిన్నారు. సేకరించిన చెత్త సంపద కేంద్రాల వద్దకు చేర్చాలి అని రోడ్ల వెంబడి వేయ కుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

వైసిపి మండల అధ్యక్షునిగా వెలది అప్పారావు

ప్రజాశక్తి - క్రోసూరు



క్రోసూరు మండలం వైసిపి అధ్యక్షుడుగా వెలది అప్పారావు రెండోసారి ఎంపికైనట్లు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు తెలిపారు. గత ఎన్నికల్లో వైసిపి తరుపున తన గెలుపు కోసం ఎంతో పని చేశారని వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధ్యక్షులు జగన్మో హన్ రెడ్డి ఆశీస్సుల మేరకు క్రోసూరు మండల నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు అని తెలిపారు. అధ్యక్షుడుగా రెండోసారి వెలదీ అప్పా రావును నియమించినట్లు ఆయన తెలిపారు. నూతన సభ్యులకు పలువురు అభినందనలు తెలియజేశారు.

తోపుడు బండి అందజేత

ప్రజాశక్తి- తాడేపల్లి



దుర్గకు బండి అందజేసిన తహశీల్దార్ సీతారామయ్య

చిరు వ్యాపారాలు నిర్వ హించుకునే పేదలకు, ఆర్థిక అవసరాలు తీరక కొట్టు మిట్టా డుతున్న నేపథ్యాన్ని గుర్తించి గివింగ్ బ్యాక్ టు సొసైటీ ప్రతి నిధులు శని వారం తోపుడు బండి అంద జేశారు. ఉండవల్లి సెంటరుకు చెందిన కుక్కల దుర్గ ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతోందని తెలిసి తాడేపల్లి తహశీల్దార్ సీతారామయ్య ద్వారా గివింగ్ బ్యాక్‌టు సొసైటీ ప్రతినిధులు బండి అందజేశారు.

చదువు కోసం ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తాడేపల్లి



చెక్కును అందజేస్తున్న శ్రీనివాసరావు

చదువు నిమిత్తం ఓ విద్యార్థినికి తాడేపల్లి రామ్ చారిటబుల్ ట్రస్ట్ శనివారం ఆర్థిక సాయం అంద జేసింది. దుగ్గిరాల మండ లం రేవేంద్రపాడు గ్రామా నికి చెందిన పీట పావని ఇంటర్మీడియట్ పూర్తి చేసి, ఇంజనీరింగ్ విద్యలో సీటు తెచ్చుకుంది. ఆర్థిక అవసరాల నిమిత్తం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న రామ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, రామ్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ పలగాని శ్రీనివాసరావు శనివారం రూ.10 వేలను చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో పుర పెద్దలు పాల్గొన్నారు.

డీజిల్ దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని ఆటోనగర్లో ఆగి ఉన్న లారీల నుండి డీజిల్ దొంగతనం చేసే ముగ్గురు దొంగలను పెదకాకాని పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు వారి వద్ద నుండి దొంగిలించిన డీజిల్, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. శనివారం వారిని కోర్టుకి హాజ రు పరిచినట్లు పెదకాకాని ఎస్ఐ మీరజ్ తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కొల్లిపర

మండలంలోని దావులూరు అడ్డరోడ్డు వద్ద శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం సంభవించింది స్థానికుల కథనం ప్రకారం తెనాలి నుంచి కొల్లిపర వస్తున్న ఆర్టీసీ బస్సు కొల్లిపర వచ్చేందుకు దావులూరు రోడ్డు వద్ద మలుపు తిరిగే క్రమంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్ ను ఢీకొనగా గేర్‌లో ఉన్న ట్రాక్టర్ వెంటనే స్టార్ట్ అయ్యి ట్రాక్టర్ కు ఎదురుగా ఉన్న రెండు ఆటోలను ఒక టీవీఎస్ వాహ నాన్ని ఢీకొనగా మోపిడిపై ఉన్న వ్యక్తికి ఆటోలో ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా గాయపడిన వ్యక్తులను చికిత్స నిమిత్తము 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్య శాలకు తరలించినట్లు గాయపడిన వ్యక్తుల బంధువులు తెలిపారు.



ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక గ్రీవెన్స్‌కు 20 అర్జీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎస్సీ, ఎస్టీల కోసం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌కు 20 అర్జీలు వచ్చాయి. వీటిని పరిష్కార నిమిత్తం సంబంధిత అధికారులకు డిఆర్‌ఒ మురళి జారీ చేశారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతు వెనుకబడిన వర్గాల సమస్యల పరిష్కారం కోసం ప్రతినెలా 4వ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఆయా వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



వెంకటకృష్ణారావుకు గౌరవ డాక్టరేట్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం తుంగపాడు గ్రామానికి చెందిన యేనుగంటి వెంకట కృష్ణారావు వికలాంగుడైనా కొన్నేళ్లుగా చేస్తున్న ప్రజా సేవకు గుర్తింపుగా చెన్నైకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. వెంకటకృష్ణారావు విజయనగరం జిల్లాలో కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు దత్తత తీసుకున్న ద్వారపూడి గ్రామంలో మహాత్మాగాంధీ వృద్ధాశ్రమం నడపడం, చదువులో వెనుకబడిన పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం, అత్యవసర సమయాల్లో రక్తదానం, వికలాంగులకు ట్రైసైకిళ్లు, బ్యాటరీ వాహనాలు ఇప్పించడంలో ముఖ్య పాత్ర పోషించారు. వికలాంగులకు పెళ్లిళ్లు చేయడంతోపాటు ఆర్థిక సాయాన్నీ అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించడం, హ్యూమన్ రైట్స్ సంస్థ, స్టెప్ ఆర్గనైజేషన్, ఎంఎఎం కళాశాలల చైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావుతో కలిసి మానవతా ఫౌండేషన్, ఇంపాక్ట్ ద్వారా వివిధ రకాల సేవలు అందిస్తున్నారు. వీటిని గుర్తించిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ డాక్టర్‌ను అందించింది. ఈ సందర్భంగా వెంకటకృష్ణారావుకు పలువురు అభినందనలు తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలో జరిగిన భారీ అగ్నిప్రమాదం దష్ట్యా పాత ఇనుప షాపుల యజమానులకు, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషనర్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ పాత ఇనుప సామాన్ల దుకాణాలు నివాసాల ప్రాంతాల మధ్యలో ఉండకుండా, అగ్నిమాపక, మున్సిపల్ శాఖ అలాగే పోలీసు శాఖ వారి అనుమతులు సూచనలతో షాపుల నిర్వహించాలని చెప్పారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రమాదాల సమయంలో షాపులో ఉండవలసిన సేఫ్టీ ఫైర్ సిలిండర్‌లను ఉంచాల్సిన విధానం, సుమారు 1000 లీటర్ల ట్యాంక్, ఇసుక బస్తాలు, షాపుకు నలుమూలల దారి ఉండేలా తీసుకోవాల్సిన జాగ్రత్లపై సూచనలు చేశారు. షాపులలో పనిచేసే కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మిక శాఖ నుంచి తప్పకుండా సర్టిఫికెట్స్ పొంది ఉండాలని చెప్పారు. షాపులో ఉన్న సామాన్లను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

లక్ష్యానికి దూరంగా పొగాకు కొనుగోళ్లు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినా ప్రకటించిన స్థాయిలో ఇప్పటి వరకు కొనుగోళ్లే లేవు. రోజుకు 30 క్వింటాళ్లు కొనడం గగనమవుతోందని, అనేక ఆంక్షలతో తమను ఇబ్బంది పెడుతున్నారని పొగాకు రైతులు వాపోతున్నారు. సాధారణంగా నియోజకవర్గంలో 500 ఎకరాల్లోపు పొగాకు సాగయ్యేది. పొగాకు ధరలు బాగున్నాయని గత సీజన్‌లో 5,500 ఎకరాల వరకూ సాగు చేశారు. దిగుబడులు సైతం ఎకరాలకు 13 క్వింటాళ్లకుపైగానే వచ్చాయి. ఇప్పటికీ 24 వేల టన్నులకుపైగా పొగాకు రైతుల వద్దే ఉంది. ఇది ఎప్పటికి కొంటారని, తాము ఖరీఫ్ సాగు ఎప్పుడు మొదలుపెట్టాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయసీజన్ ప్రారంభమై 20 రోజులు కావస్తుండడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.



పొలంలోనే ఉన్న పొగాకు

రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతుల పోరాట ఫలితంగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పొగాకు కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించింది. తొలుత యడ్లపాడు మండలం మైదవోలులో కేంద్రాన్ని ప్రారంభించగా ఇప్పటి వరకు 554 క్వింటాళ్ల పొగాకును కొనుగోలు చేశారు. శనివారం నాడు చిలకలూరిపేటలోని కొత్త మార్కెట్ యార్డులో కొనుగోలు ప్రారంభించారు. ప్రతిరోజూ 200 క్వింటాళ్లు కొంటామని అధికారులు ప్రకటించినా ఆచరణలో అమలు కావడం లేదు. మొదటి రెండ్రోజులు 59 క్వింటాళ్లే కొన్నారు. అయితే 5 రోజుల్లో 554 క్వింటాళ్లు మాత్రమే కొన్నారు. చిలకలూరిపేటలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఎలా ఉంటుందోనని రైతులు ఆలోచిస్తున్నారు. దీనికితోడు కొనుగోలు సందర్భంలో నాణ్యత, ఇతర ఆంక్షలు పేరుతో ధర తగ్గిస్తున్నారని, రూ.12 వేల ధర ఇవ్వాల్సింది రూ.9 వేలు మాత్రమే ఇస్తున్నారని, పూర్తి ధర ఇవ్వాలని కోరుతున్నారు.

ఈ సారి పొగాకు సాగుచేయొద్దు : ఎమ్మెల్యే



పొగాకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కంపెనీలు పొగాకును కొనకుండా చేసిన మోసాన్ని గుర్తించి ఈ సారి రైతులు పొగాకును సాగు చేయొద్దని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆయన పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై రైతులకు అందించిన వ్యవసాయ డ్రోన్లను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పొగాకు కొనుగోళ్ల కోసం రూ.300 కోట్ల వరకు ప్రభుత్వం విడుదల చేసిందని, కేంద్రాలకు పొగాకును తెచ్చే బేళ్లను గ్రేడులుగా వర్గీకరించి రైతులు జాగ్రత్తగా తెస్తే మంచి ధర వస్తుందని చెప్పారు. నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో 99 వేల క్వింటాళ్ల పొగాకు ఉందని, ఈ మొత్తం పంటను కొనాలని అధికారులకు చెప్పారు. జాతీయ రహదారుల విస్తరణ, నూతన రహదార్ల ఏర్పాటు సందర్భంగా భూములు, భవనాలు కోల్పోయే రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. చీరాల-పిడుగురాళ్ల హైవే విస్తరణకు భూమిలిచ్చే రైతులకు కూడా గతంలో బైపాస్ నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు ఇచ్చినట్టే పరిహారం అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిడిఎంఎస్ చైర్మన్ వి.హరిబాబు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కూటమి నేతలు ఎన్.సదాశివరావు, షేక్ కరీముల్లా, జె.మధన్ మోహన్, కె.సాయిబాబు, వీరారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జి.నాగపూర్ణ చంద్రరావు, ఎ.సాంబాబు, ఎ.రవి పాల్గొన్నారు.



ఇబ్బంది పెడుతున్న మురుగు నీరు.. పట్టించుకునేదెవరు..?

ప్రజాశక్తి - క్రోసూరు

మండల కేంద్రమైన క్రోసూరులోని నాలుగు రోడ్ల సెంటర్లో మురుగు సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు డిమాండ్ చేశారు. మురుగు నిలిచిన ప్రాంతాన్ని సిపిఎం నాయకులు శనివారం పరిశీలించి జిల్లా పంచాయతీ అధికారికి ఫోన్ చేసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ నాలుగు రోడ్ల సెంటర్‌లో మురుగునీరు నెలల తరబడి రోడ్డుమీద పారుతూ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఆర్ అండ్ బి రోడ్డు సైతం కోతకు గురవుతోందని చెప్పారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు కార్యాలయాలకు సమీపంలోనే ఈ సమస్య ఉన్నా పట్టించుకున్నవారు లేరని, అధికారులకు ప్రజలు విన్నవించినా నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. ప్రతిరోజూ వేలమంది తిరిగేటువంటి ఈ ప్రాంతంలో మురుగునీరు రోడ్డుమీద నిలిచినా స్థానిక నాయకులు సైతం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించకుంటే ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా డిపిఒతో ఫోన్‌లో నాయకులు మాట్లాడినానంతరం మండల అధికారులు వచ్చి సందర్శించారు. సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు, నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, కె.గోపికృష్ణారెడ్డి, సిహెచ్.యేసయ్య, కె.అనూష, రవీంద్రారెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.



సెమిస్టర్ ఫలితాలలో ఈశ్వర్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం కేసానుపల్లి గ్రామ పరిధిలోని ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా చదువుతున్న విద్యార్థులు ఇటీవల విడుదలైన ప్రథమ, ద్వితీయ సంవత్సర సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్ శనివారం తెలిపారు. తమ విద్యార్థులు షేక్ జాబీన్, కె.పవన్‌కుమార్ కళాశాల టాపర్స్‌గా నిలిచారన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, సెక్రటరీ - మేనేజింగ్ డైరెక్టర్ షేక్.మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు అభినందించారు. అనుభవం కలిగిన అధ్యాపకులచే అత్యాధునిక నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ బోధనకు ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ఈ ఫలితాలు వచ్చాయన్నారు. బాహుళ జాతి కంపెనీలు తమ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లోనూ తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారని, నూరుశాతం ఉపాధి కల్పనే తమ లక్ష్యమని అన్నారు.




చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దండి


ప్రజాశక్తి - దుర్గి

పరిసరాల పరిశుభ్రత ధ్యేయంగా చెత్త రహిత గ్రామాలుగా అన్ని ఊళ్లనూ తీర్చిదిద్దాలని ఎంపిడిఒ శివప్రసాద్ అన్నారు. పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోలగుట్ల గ్రామాన్ని ఆయన శనివారం సందర్శించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ఇది అందరి బాధ్యతని చెప్పారు. తడి చెత్త పొడి చెత్త విడివిడిగా వేరు చేసి స్వచ్ఛ సంకల్ప ట్రాక్టర్లలో వేసి డంపింగ్ యార్డ్‌లకు తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో, కాల్వల్లో వేస్తే దోమలు, ఈగలు పెరిగి ప్రజలు రోగాల పాలవుతారని చెప్పారు. ఈవోపీఆర్డి శివప్రసాద్, సర్పంచ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి పెదకూరపాడు

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యంపై ఎంపిడిఒ సోమయాజులు, ఇఒపిఆర్‌డి శరత్‌బాబు శనివారం తనిఖీ చేశారు. చిన్నమక్కెన, పొడపాడు గ్రామాలలో పారిశుధ్య పనులను పరిశీలించారు. పాఠశాలల విద్యార్థులకు పరిసరాలు, పరిశుభ్రత, పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్నారు.







తుళ్లూరులో మాట్లాడుతున్న సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవి, ఎం.భాగ్యరాజు, పెదకాకానిలో డిప్యూటీ తహశీల్దార్‌కి సమ్మె నోటీసు అందిస్తున్న నాయకులు, ముఠా కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఎం.బాలాజీ

9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తుళ్లూరు

జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవి, ఎం.భాగ్యరాజు పిలుపు నిచ్చారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో శనివారం పని విరామ సమయంలో పారిశుధ్య కార్మికులతో కలిసి లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని యజమానులకు కట్టు బానిసలుగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడులను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. పని గంటల పెంపును నిలిపివేయాలని, లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులన్నీ హరించుకు పోతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు.వేతనాల చెల్లింపు చట్టం, కనీస వేతనాల చట్టం, బోనస్ చెల్లింపు చట్టం, సమాన పనికి సమాన వేతన చట్టం రద్దవుతాయని, దీనివల్ల కార్మికులకు తీవ్రమైన నష్టం జరుగుతుందని అన్నారు.ఇవే కాకుండా సామాజిక భద్రత చట్టాలన్నీ రద్దు అవుతాయని అన్నారు. పని గంటలు,కనీస వేతనాలు, సామాజిక భద్రత, కార్మిక సంఘాల ఏర్పాటు గుర్తింపు, బేరసారాలు, సమ్మె హక్కుతో సహా ఆందోళన పోరాటాలు కలిగి ఉన్న హక్కులను లేబర్ కోడ్స్ మింగేస్తాయని అన్నారు. లేబర్ కోడ్స్ రద్దు కోసం, 17 అంశాల చార్టర్ ఆఫ్ డిమాండ్‌ల సాధన కోసం సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రవి, భాగ్యరాజు కోరారు. కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని

కార్మికుల న్యాయమైన హక్కుల కోసం జులై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు నన్నపనేని శివాజీ పిలుపునిచ్చారు.పెదకాకాని మండలం శనివారం ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్, ట్రేడ్ యూనియన్లు అన్ని రకాల ఎంప్లాయిస్ కోసం వామపక్షాల ఆధ్వర్యంలో జరగబోతున్న సమ్మె గురించి డిప్యూటీ తాసిల్దార్ ప్రసాద్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 21000 ఇవ్వాలని జీవో నెంబర్ 132. 142. 680 అమలు చేయాలని టెండర్లపై హైకోర్టు తీర్పు అమలు చేయాలని జులై 9న జరిగే సమ్మెలో పంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు రాజా రమేష్, బి.సురేష్, జి.నాగమల్లేశ్వరి, కె.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏ మండల కమిటీ ఆధ్వర్యంలో..

కార్మికుల న్యాయమైన హక్కుల కోసం జులై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన పెదకాకానిలో శనివారం రెవెన్యూ గ్రామ సహాయకుల వీఆర్ఏ మండల కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ తాసిల్దార్ ప్రసాద్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడారు. వీఆర్ఏలకు టైం స్కేల్ జీవితంలో చెల్లించాలని, డిఏని జీవితంలో కలపాలన్నారు. నైట్ డ్యూటీలు అక్రమ డ్యూటీలు నిలిపివేసి రీ సర్వేలకు టిఏడిఏ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏ, అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్ డ్రైవర్, కంప్యూటర్ ఆపరేటర్, ఖాళీ పోస్టులలో అర్హులైన వీఆర్ఏలను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజా రమేష్, గ్రామ రెవెన్యూ సహాయకుల వీఆర్ఏ మండల కార్యదర్శి బి.సురేష్, జి.నాగమల్లేశ్వరి, కె.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక విధానాలపై జూలై 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో ముఠా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గని జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ అన్నారు. శనివారం మంగళగిరి పట్టణంలోని మెయిన్ బజార్లో ముఠా కార్మికులతో విస్తృత సమావేశం జరిగింది. కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్స్ మోడీ ప్రభుత్వం తీసుకురావడం జరిగిందని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా సమ్మె జరుగుతుందని, సమ్మెలో ముఠా కార్మికులందరూ పాల్గొన్నారు. కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు, ముఠా వర్కర్స్ యూనియన నాయకులు గోపి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు ఛానల్ లాకులను, కాల్వ గట్లను పరిశీలిస్తున్న రైతులు

గుంటూరు ఛానల్ పనులు వెంటనే చేపట్టాలి

ప్రజాశక్తి - పెదకాకాని

నిత్యం లక్షల మందికి మంచినీరు పొలాలకు సాగునీరు అందించే గుంటూరు ఛానల్ కాలువ గుర్రపు డెక్కతో పుడుకుపోయిందని, తక్షణమే గుర్రపు డెక్కను తొలగించాలని కాలవ కట్టలు మరమ్మతులు చేపట్టాలని, లాకులు తుప్పు పట్టి శిధిలావస్థకు చేరాయని వాటిని పున నిర్మాణం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు.రైతులతో కలిసి గుంటూరు ఛానల్‌ను శనివారం పరిశీలించారు. శివాజీ మాట్లాడుతూ గుర్రపు డెక్క నివారణ కోసం గడ్డి మందు కొట్టడంతో గుర్రపు డెక్క కుళ్లిపోయింది అని ఈ నీరు అలాగే పట్టణ వాసులకు చేరితే రోగాల బారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. కోతకు గురైన కాల్వ గట్లకు మరమ్మతులు చేపట్టాలని, పెదకాకాని నుండి గోళ్ళమూడి వెళ్లే రోడ్డు కాలువ లాకులు తుప్పు పట్టి నిర్వహణ సరిగలేక శిధిలావస్థకు చేరాయని లాకులు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోటిపల్లి సత్యనారాయణ, రాజా రమేష్, రైతులు దారం భవాని శంకర్, ఆలపాటి రాము, పి.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో షబీనాకు కాంస్యం

ప్రజాశక్తి - మంగళగిరి



కాంస్య పతకం సాధించిన షబీనా

ఈనెల 22వ తేదీ నుండి 30వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని ధావన్ గిరిలో జరుగుచున్న జూనియర్ నేషనల్ ఎక్యూప్డ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీలో ఆంధ్రప్రదేశ్ తరపున గుంటూరు జిల్లా తెనాలికి చెందిన షేక్ షబీనా 84 కేజీ విభాగంలో కాంస్య పతకం సాధించారని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సందాని సంయుక్తంగా శనివారం తెలియజేశారు. పవర్ లిఫ్టర్ షేక్ షబీనా ని ఆమె కోచ్ షేక్ సంధానిని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆర్.ఎన్.వంశీకృష్ణ, సౌత్ ఇండియా మరియు ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సకల కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, అధ్యక్షులు గంట వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు మద్ది ప్రభాకర్ అభినందించారు.



కార్మికులతో మాట్లాడుతున్న వేముల దుర్గారావు

ముఠా కార్మికులకు సంక్షేమ చట్టం కావాలి

ప్రజాశక్తి- తాడేపల్లి

అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ముఠా కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం కావాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని దినం కోసం, కనీస వేతనాలు సాధన కోసం, ప్రైవేటు కరణ విధానాలను వ్యతిరేకిస్తూ జూలై 9వ తేదీ దేశవ్యాప్తంగా జరగబోయే కార్మిక సమ్మెలో తాడేపల్లిలోని టీటీడీ యార్డు ముఠా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తాడేపల్లిలోని టీటీడీ యార్డులో ముఠా కార్మికుల సమావేశం శనివారం మేస్త్రి కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. దుర్గారావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం మీద తీవ్రమైన టువంటి నిర్బంధం ప్రయోగిస్తుందని మండిపడ్డారు. కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పెట్టుబడి దారులకు అనుకూలంగా భారతదేశ కార్మికుల శ్రమను కారు చౌకగా దోచిపెట్టడానికి చట్టాలను తీసుకువస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని జులై 9 జరిగే సమ్మెలో టిటి యార్డ్ ముఠా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటిసి నాయకులు టీ వెంకటయ్య, సుబ్బారావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సంఘం జిల్లా నాయకులు దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం భవన నిర్మాణ కార్మికుల విస్తృత సమావేశంలో పండల పుల్లారావు అధ్యక్షతన జరిగింది. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడేళ్లుగా భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కరోనా సమయంలో రెండు సంవత్సరాలపాటు పనులు లేక, కుటుంబాలు గడవక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడ్డారని. అటువంటి సమయంలో భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు అండగా ఉండి తన వంతు ఆర్థిక సహాయం అందించి కార్మికులకు భరోసా ఇచ్చిన సంఘం మన భవన నిర్మాణ కార్మిక సంఘమేనని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ఎన్నికల్లో ఒక ఎజెండాగా చేర్చే విధంగా పోరాడిన ఘనత తమకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక కొరత, అధిక ధరలు తగ్గించాలని ప్రభుత్వంపై పోరాటం చేసి విజయం సాధించామని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని రాష్ట్ర వ్యాపితంగా మనం చేసిన పోరాట ఫలితంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డుకు ఛైర్మన్‌ను నియమించిందని తెలిపారు. తిరిగి సంక్షేమ పథకాలు అమలయ్యేవరకు పోరాడుతామన్నారు. యూనియన్ 8వ రాష్ట్ర మహాసభలు గుంటూరులో 2025 జూలై 23, 24, 25 తేదీల్లో జరుగుతాయని, మహాసభల్లో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరణ గురించి, రాజధాని నిర్మాణంలో స్థానికులకు పనులు కల్పించడం, తదితర విషయాలను చర్చించి, భవిష్యత్ కర్తవ్యాలను రూపొందిస్తారన్నారు. అనంతరం ఐదుగురితో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా పండల పుల్లారావు, రాఘవరపు అప్పారావు ను ఉపాధ్యక్షుడుగా జగ్గారపు బాబ్జి సహాయ కార్యదర్శిగా మనెం రాంబాబు కోశాధికారిగా మోర్ల సురేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు వుద్దంటి దుర్గారావు వత్రం పూర్ణయ్య భవన నిర్మాణ కార్మికులు జె.వాసు, ఎం.వెంకటేశ్వరరావు, పి.సాంబయ్య, ఎం.శివ బాబు, కె.వెంకటేశ్వరరావు, ఆర్.నాగరాజు, కె.సాయిగోపి, జె.శ్రీను, కె.మునిబాబు, కె.శ్రీనివాసరావు, వై.శివ నాగరాజు, పి.దుర్గాప్రసాద్, డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

207వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 207వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ తాడేపల్లి పట్టన కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడారు. దీక్షల్లో డి.రమణమ్మ, యూ కాసమ్మ, ఎం.శారద. డి.సువర్ణకుమారి, డి.బేబీసరోజనమ్మ కూర్చున్నారు. కార్యక్రమంలో షేక్ సుభాని, ఎం.ఆశీర్వాదం, షేక్ బాషా, ఆరిఫ్,వైసాంబశివరావు, యన్ సుబ్బారావు, ఎంగురవయ్య, తుపాకుల నాగేశ్వరావు, బి.సూర్యప్రకాశరావు, యహెూషువ, హగ్గయ్య, మరియు మహిళా మహిళా సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.



బైకు యాత్రతో బయలుదేరిన కెవిపిఎస్ నాయకులు

దళితులపై దాడులను అరికట్టాలి..

ప్రజాశక్తి - మంగళగిరి

కూటమి ప్రభుత్వం దళితులపై దాడులను అరికట్టాలని కెవిపిఎస్ నాయకులు శనివారం కోరారు. తెనాలి పోలీసుల అరాచకాన్ని మానవ హక్కుల ఉల్లంఘనను నిలదీస్తూ తెనాలిలో జరిగే మానవ హక్కుల పరిరక్షణ సదస్సుకు మంగళగిరి అంబేద్కర్ సెంటర్ నుండి కెవిపిఎస్ నాయకులు బైక్ యాత్రతో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ తెనాలి పోలీసులు నడిరోడ్డుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని ఖండించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రజా ప్రతినిధులు పోలీస్ చట్ట వ్యతిరేక చర్యలను బలపరుస్తూ మాట్లాడడం దారుణంగా ఉందని అన్నారు. తెనాలి కేసులో వాస్తవాలను బయటకు తీయకుండా రాజ్యాంగానికి, చట్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు బి.వెంకటేశ్వర రావు, మేరీ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన ఎమ్మెల్యే

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ రాష్ట్ర మంత్రులను శనివారం కలిశారు. రాష్ట్ర మున్సిపల్ అడ్మిని స్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రి పొంగూరి నారాయణ, మైన్స్, జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విజయవాడ కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మర్యాద పూర్వ కంగా కలిసి. సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధి. పలు కీలక అంశాలపై చర్చించారు.



ట్యాబులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

మెప్మా ఆర్పీలకు ట్యాబులు అందజేత

ప్రజాశక్తి - వినుకొండ

డ్వాక్రా సంఘంలోని సభ్యులకు సేవలు వేగవంతంగా అందించాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని అమలు చేయడం హర్షనీయమని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. శనివారం వినుకొండ మునిసిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన మెప్మా ఆర్పీలకు ట్యాబులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థిక స్వాలంబనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళా సంఘాల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచుటకు ప్రభుత్వం ట్యాబులు అందజేసిందన్నారు. ప్రతి ఇంట్లో ఒక్క ఎంటర్ ప్రెన్యూర్ ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.



గుంతలను పూడుస్తున్న రామకృష్ణ సేవా సమితి సభ్యులు

గుంతలను పూడ్చిన రామకృష్ణ సేవా సమితి సభ్యులు

ప్రజాశక్తి - మాచర్ల

రైల్వే గేటు వద్ద పట్టాల మధ్య, చంద్రవంక బ్రిడ్జి వద్ద ఉన్న గుంతలను పట్టణంలోని శ్రీరామకృష్ణ సేవా సమితి సభ్యులు శనివారం పూడ్చారు. రైల్వే గేట్ దగ్గర ఉన్న గుంతల వలన ట్రాఫిక్ జామ్ అయి టూవీలర్స్ వారు ఫోర్ వీలర్స్ వారు ఇబ్బందులు పడుతున్న అంశం సేవా సమితి దృష్టికి వచ్చినట్లు అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి తమ సభ్యులతో కలిసి కంకర, ఇసుక, సిమెంట్ కలిపి గుంతలను పూడ్చి వేయడంతో ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం ముత్యాల పాపిరెడ్డి, ఆర్టీసీ ఎంప్లాయ్ పి. శ్రీనివాసరావు, సేవాసమితి సభ్యులు వినయ్ హరి, రాజు, అంజిబాబు పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవంలో భాగంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో డాక్టర్ షమీమా

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఇనిమెళ్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్యురాలు షమీమా మాట్లాడుతూ పొగాకు, మాదక ద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్ సేవించడం ద్వారా జీవితాన్ని కోల్పోతామని తెలియ జేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఎన్ నాగలక్ష్మి మాట్లాడుతూ ధూమపానం చేసేవారికి దూరంగా ఉండాలని, అన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది బి స్వరూప,జి లక్ష్మి కుమారి, ఆశ వర్కర్లు వి సిద్దాభి, ఐ నాగమణి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుర్గి

పొగాకులో ప్రతి ఒక్కరు వ్యతిరేకించి ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భాను ప్రకాష్ అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీని ఆయన నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దాన్ క్యూర్" వ్యాధి వచ్చిన దానికంటే ముందుగానే జాగ్రత్త పడటం మంచిదని తెలిపారు. యువత మారక ద్రవ్యాలకు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని, "డ్రగ్స్ నిషే ధించండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి "అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులను అంద జేశారు. హెచ్‌వి శ్రీనివాసరావు, సిహెచ్ఓ కల్పన, ఎంఎల్‌హెచ్ పి గాయత్రి, ఏ అన్నమ్మ, శివమ్మ, ఇన్చార్జి హెచ్ఎం హనుమం తరావు, ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కారంపూడి

మండల వైద్యాధికారి డాక్టర్ కే. లక్ష్మీ మౌనిక ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 7, 8, 9 తరగతి విద్యార్థులకు పొగాకు పరిశ్రమలు, వాటి ఉత్పత్తుల వలన కలిగే నష్టాలు అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ బాణావత్. బాలునాయక్, ప్రధానోపాధ్యాయులు జీ. శేషిరెడ్డి, ఉపాధ్యాయులు బాలాజీ, సుబ్బారావు, సిహెచ్ఓ కే. మల్లయ్య, సూపర్వైజర్ కె.వి మణి, ఆరోగ్య సహాయకులు జి. ఈశ్వరమ్మ, ఎస్ కే సల్మా, జి. అనసూయమ్మ, అనురాధ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్రోసూరు

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కోసూరు మండలం క్రోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7, 8, 9 తరగతుల విద్యార్థులకు ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ ఆధ్వర్యంలో 'పొగాకు, నికోటిన్ ఉత్పత్తులు తయారు చేసే పరిశ్రమల గురించి అవగాహన'అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను, ప్రశంసాపత్రాలను వైద్యాధికారిని సిరిచందన, ప్రధానోపాధ్యాయులు జి రామాంజనేయులు, ఆరోగ్యవిస్త రణాధికారి శిఖాశాంసన్ అందజేశారు ఉపాధ్యాయులు దుగ్గి బాబురావు, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని తాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పొగాకు నియంత్రణ కార్యక్రమం పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు డాక్టర్ ఎస్.మౌనిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి అందించారు. కార్యక్రమంలో హాస్టల్ సూపర్‌వైజర్ దిలీప్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ రామలింగేశ్వర స్వామి తిరునాళ్లపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ కొండపై వేంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి తిరునాళ్ల తొలి ఏకాదశి పండుగను జులై 6వ తేదీన అత్యంత వైభవంగా జరిపేందుకు అధికారులు సమిష్టిగా పని చేసి సందర్శకులకు మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ఆదేశించారు. తొలి ఏకాదశి కొండ తిరునాళ్ల సందర్భంగా శనివారం మునిసిపల్ సమావేశ మందిరంలో నరసరావు పేట ఆర్డీవో మధులత అధ్యక్షతన నిర్వహించిన అధికారుల సమీక్ష సమావేశానికి ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయానికి అత్యంత చారిత్రాత్మక చరిత్ర కలిగి ఉందని, స్వామివారిని దర్శించుకునేందుకు వేలాదిగా తరలి వస్తారని, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలనిన్నారు. మెట్ల మార్గంలో వెళ్ళు సందర్శకులతోపాటు, మెయిన్ బజార్ నుండి చిన్న కొండపైకి వెళ్లే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌ను ఆదేశించారు. దేవాలయం పరిసర ప్రాంతాల్లో పూజా సామాగ్రి అధిక రేట్లకు విక్రయించకుండా దేవాదాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఘాట్ రోడ్డులో మరమ్మత్తు పనులు వెంటనే చేయాలని పిఆర్,



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

ఆర్అండ్‌బి అధికారు లను ఆదేశించారు. తిరునాళ్ల రోజు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎటువంటి అవాంఛ నీయ సంఘ టనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. తిరునాళ్ల రోజు 35కుపైగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైన చోట కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నరసరావుపేట ఆర్డీవో మధులత మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులందరూ సమన్వయంతో తిరుణాలను విజయవంతం చేసే విధంగా పని చేయాలని కోరారు. సమీక్షా సమావేశంలో జెడిసిసి ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మునిసిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, తాసిల్దార్ సురేష్, ఎండోమెంట్ ఈవో, ఆలయ కమిటీ అధ్యక్షులు, వినుకొండ నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

సత్తెనపల్లి ఎంపిడిఓ బండి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న ఎంపిడిఓ శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజల భాగస్వామ్యం తప్పనిసరని సత్తెనపల్లి ఎంపిడిఓ బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం నందిగామ ఎల్‌టిసిలో ఘన వ్యర్థాల నిర్వహణపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి, రాజుపాలెం, ముప్పాళ్ళ, నకరికల్లు మండలాల డిప్యూటీ ఎంపిడిఓ, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల్లో ఘన వ్యర్థాల సమర్థ నిర్వహణ అంశంపై శిక్షణ ఇచ్చారు. ఎంపిడిఓ బండి శ్రీనివాసరెడ్డి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాల ప్రాధాన్యతను గురించి వివరించారు. సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి విజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రత బాటపట్టాలని పిలుపు నిచ్చారు. సత్తెనపల్లి డిప్యూటీ ఎంపిడిఓ ఎ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛత లక్ష్యాలను చేరుకోవడంలో ప్రజల పాత్ర కూడా కీలకం అని పేర్కొన్నారు. ఇళ్ల వద్దకు వచ్చే హరిత రాయబారులకు ప్రజలు సహకరిస్తే తడి, పొడి చెత్త సేకరణ సజావుగా జరుగుతుందని, తద్వారా వీధులు, గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముప్పాళ్ళ డిప్యూటీ ఎంపిడిఓ రూపవతి నకరికల్లు ఇన్చార్జి డిప్యూటీ ఎంపిడిఓ కె.వి.ఎస్.ప్రసాద్ నందిగామ పంచాయతీ కార్యదర్శి కుంభ వెంకటేశ్వర్లు, ఐటీసీ రిసోర్స్ పర్సన్ సిహెచ్ బొల్లయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

నాదెండ్ల ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రంలో నియోజక వర్గంలోని పంచాయతీ కార్యదర్శులకు చెత్త సేకరణ, ఘన వ్యర్థాల నిర్వహణపై శనివారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి డిఎల్పీఒ లక్ష్మణరావు, ఎంపీడీవో స్వరూపరాణి, డిప్యూటీ ఎంపీడీవో నిర్మల లక్ష్మీకుమారి, ఎడ్లపాడు డిప్యూటీ ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, చిలకలూరిపేట డిప్యూటీ ఎంపీడీవో, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. కార్యక్రమ ఏర్పాట్లను నాదెండ్ల పంచాయతీ కార్యదర్శి మక్కెన సుబ్బారావు పర్యవేక్షించారు.

5న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జూలై 5 తేదీన నిర్వహించే నేషనల్ లోక్ అదాలత్ సందర్భంగా కక్షిదారులు ప్రామిసరీ నోట్లు, చెక్కు కేసులు, సివిల్ దావాలకు సంబంధించిన కక్షిదారులు కేసులను రాజీ చేసుకోవచ్చని స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్, మండల న్యాయ సేవా ధికారి సమస్త ఛైర్మన్ నరేంద్ర రెడ్డి అన్నారు. స్థానిక సాంబశివ కాలనీలోని సివిల్ కోర్టు హాల్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడం ద్వారా కోర్టు సమయం వృథా కాకుండా వారు కట్టిన కోర్టు ఫీజు వెనక్కి ఇవ్వటం జరుగుతుందన్నారు.

ప్రజాశక్తి-మాచర్ల

స్థానిక కోర్టు ఆవరణలో జూలై 5న జరిగే జాతీయ లోక్అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి శ్రీనివాసకళ్యాణ్ సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మాచర్ల కోర్టుల పరిధిలోని అన్నిరకాల సివిల్ కేసులు, భరణం కేసులు, గృహ హింస కేసులు, బ్యాంక్ లావాదేవీల కేసులు, రాజీ చేయదగిన క్రిమినల్ కేసుల్లోని కక్షిదారులు, ముందస్తు రాజీ చేసుకోదగిన కేసుల్లోని ఇరుపక్షాల వారు సామరస్యపూర్వకంగా రాజీ పడి పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. మాచర్ల కోర్టుల పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి సూచించారు.

30న జాబ్ మేళా

ప్రజాశక్తి-చిలకలూరిపేట

డిపార్టెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్ వారి అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపిఎస్ఎస్‌డిసి) మోడరన్ డిగ్రీ కళాశాల, చిలకలూరిపేట అధ్వర్యంలో జాబ్ మేళను సోమవారం నిర్వహిస్తు న్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ. తమ్మాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడరన్ డిగ్రీ కళాశాల, చిలకలూరిపేట మోడరన్ కాంప్లెక్స్, చిలకలూరిపేటలో జాబ్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో సుమారు 10 కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. జీతం వారి విద్యార్హతను బట్టి సుమారు రూ.12 నుంచి 35 వేల వరకు ఉండవచ్చన్నారు. ఈ జాబ్ డ్రైవ్‌కు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బి.టెక్, డి ఫ్లొమా, ఫార్మసీ, పిజి వి భాగముల వరకు చదువు కున్న 18-40 సంవత్సరాల వయసు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు వారి బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్‌నకలు పాస్‌పోర్ట్ ఫోటోతో ఉదయం 9:00 నుండి సాయంత్రం 4:00 గంటల వరకు నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని చిలకలూరిపేట నియోజకవర్గ పరిసర ప్రాంత యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



నాలుగేళ్లయినా రోడ్ల పరిస్థితి ఇంతేనా..

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో కొత్తగా వాటర్ పైపులైన్లు వేయాలని, సిమెంట్ రోడ్లను అన్ని ప్రాంతాల్లో పగలగొట్టారు. నాలుగు సంవత్సరాలు కావొస్తోంది. పగలగొట్టిన సిసి రోడ్లపై బైకులు, సైకిళ్లతో వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉంది. కూటమి నాయకులు అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే పగలగొట్టిన సీసీ రోడ్లపై రోడ్లు వేస్తామని వాగ్దానం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పైన అవుతున్నప్పటికీ ఇంతవరకు వాటి గురించి పట్టించుకోలేదు. ఓట్లు కోసం మాత్రం వాగ్దానం చేశారని, గెలిచిన తర్వాత పట్టించు కోవడంలేదని భార్గవ్ పేటకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో ఇలాంటి పరిస్థితి దాపురించడం దారుణంగా ఉందని అన్నారు. మంగళగిరి పట్టణంలో భారీ మెజార్టీ లోకేష్‌కు ఇచ్చినప్పటికీ రోడ్ల పరిస్థితి గురించి మాత్రం పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన తిరుమలశెట్టి

ప్రజాశక్తి - మంగళగిరి



మంత్రి లోకేష్‌తో తిరుమలశెట్టి

రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్‌ను శనివారం ఉండవల్లి లోని ఆయన నివాసంలో నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు తిరుమలశెట్టి కొండలరావు కలిశారు. నియోజకవర్గంలో అధికశాతం పేద కాపులు ఉన్నారని, వివాహాది శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు కాపు కళ్యాణ మండపానికి స్థలం కేటాయించాలని మంత్రి లోకేష్‌ను కోరగా స్పందించిన ఆయన రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తాడేపల్లి ఆంధ్రరత్న పంపింగ్ స్కీం పరిధిలో దాదాపు 3600 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేసుకుంటూ రైతులు ఎన్నో ఏళ్లుగా కుటుంబాలను పోషించు కుంటున్నారని, ఈనేపథ్యంలో పంపింగ్ స్కీంలోని మోటార్లు పని చేయక సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆంధ్రరత్న పంపింగ్ స్కీంకు నూతన మోటార్లు ఏర్పాటు చేయించి రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలని మంత్రి లోకేష్‌ను కోరగా సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి ఆంధ్రరత్న పంపింగ్ స్కీంకు నూతన మోటార్లు ఏర్పాటు చేయించి రైతులకు సాగునీటిని విడుదల చేయిస్తానని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి నిడమర్రు రోడ్డు పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనుల దృష్ట్యా రోడ్డుకు ఇరువైపులా ఉన్న టింబర్ వ్యాపారస్తులు, ఇతర ప్రజానీకం పడుతున్న ఇబ్బందులను, తెనాలి రోడ్డు విస్తరణతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి మంత్రి లోకేష్‌తో చర్చించారు. కాపు సంఘం నాయకులు మొహమాటం అనిల్ బాబు, సామావు సాంబ, రామాంజనేయులు, మక్కే మస్తాన్ రావు తదితరులు మంత్రి లోకేష్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజి శాఖల మంత్రి నారా లోకేష్ తనను కలవడానికి వచ్చే వారంతా పుష్పగుచ్ఛాలు, శాలువాలకు బదులు నోటు పుస్తకాలు, లైబ్రరీ పుస్తకాలు, విద్యార్థులకు పనికొచ్చే విద్యాసామగ్రి తీసుకురావాలని కోరడంతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ఆయనను కలవడానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలు అధికారులు నోట్ పుస్తకాలు అందజేశారు. మంగళగిరి పట్టణం వీవర్స్ కాలనీలోని ఎంటీఎంసీ హైస్కూలులో ఉన్న బాలికలకు స్థానిక నాయకుల ద్వారా పంపిణీ చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, టీడీపీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, వార్డు అధ్యక్షులు వంగర సదాశివరావు, స్కూలు చైర్మన్ వంగర హనుమాన్, స్కూలు వైస్ చైర్మన్ బిట్రా చెన్నకేశ్వరి, సీనియర్ నాయకులు నందం బాబురావు, శివాలయం బోర్డు మెంబర్ ఉడత లావణ్య పాల్గొన్నారు.

"బీసీ ఆత్మగౌరవ భరోసా" సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శంకరరావు

వచ్చేనెల 6న తిరుపతిలో జరిగే "బీసీ ఆత్మగౌరవ భరోసా" బహిరంగ సభకు రాష్ట్రవ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చి సత్తా చాటాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. శంకరరావు మాట్లాడుతూ సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, వైద్య-ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఘనులు-భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హాజర వుతారని తెలియజేశారు. ఇంకా వారు వెనుకబడిన తరగతులైన బీసీల సంక్షేమం-అభివృద్ధి కోసం, వారి అవసరాలు - ఆకాంక్షలు నెరవేర్చేందుకు, పలు దశాబ్దాలుగా బీసీ సంఘాలు పోరాడుతున్నాయన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా అశోక్, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, విజయవాడ నగర అధ్యక్షులు చిప్పాడ చందు, రాష్ట్ర కార్యదర్శి శివరాం బాబాజీ, తిరువీధుల కిరణ్, పూర్ణచంద్రరావు, జంజనం వరప్రసాద్, ఉడతా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ చేస్తున్న కొండా శ్రీనివాసరెడ్డి దంపతులు

తమ తల్లిదండ్రులు కొండా సుబ్బారెడ్డి (అల్లం), సుబ్బమ్మ జ్ఞాపకార్థం ఎం.టి.ఎం.సి పరిధిలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన కొండా శ్రీనివాసరెడ్డి (అల్లం) వాణి ప్రసన్న దంపతులు శనివారం గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలలో 150 మంది పేద విద్యార్థిని, విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా దాత శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలలో పేద విద్యార్థిని, విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ స్టేషనరీ సామాన్లు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎలిమెంటరీ పాఠశాల గ్రామంలో ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యార్థులతో తాము గడపడం సంతోషంగా ఉందని అన్నారు. చిన్నతనం నుండే క్రమశిక్షణ కలిగి, పట్టుదలతో విద్యను అభ్యసించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లంకపల్లి నాగేశ్వరరావు వైఎస్ఆర్‌సిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా నాగేశ్వరరావు, సిపిఎం కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, వైఎస్ఆర్‌సిపి గ్రామ అధ్యక్షులు మిరియాల రాంబాబు, వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు గడ్డం తాతారావు, బిరుదుగడ్డ విజయేందర్ రావు, కూరపాటి సాంబిరెడ్డి, చాగంటి సాంబిరెడ్డి, కమ్మిశెట్టి శివ నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సుధా రత్నకుమారి, లాల్ అహ్మద్, సృజన తదితరులు పాల్గొన్నారు.



తడి, పొడి చెత్త గురించి వివరిస్తున్న అధికారులు

తడి, పొడి చెత్త వేరుచేస్తే సంపదను సృష్టించవచ్చు

ప్రజాశక్తి - పెదకాకాని

తడి, పొడి చెత్త వేరు చేస్తే సంపదను సృష్టించవచ్చు అని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో పారిశుద్ధ్య పనులు శరవేగంగా జరుగుతున్నాయని మండల పరిషత్ పంచాయతీ అధికారులు ప్రజా ప్రతినిధులు పనులను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. శనివారం పెదకాకాని గ్రామాల్లోని లూథర్ గిరిలో పనులు ప్రారంభించామని, తడి చెత్త పొడి చెత్త వేరు చేస్తే వచ్చే లాభాల గురించి గృహిణులకు వివరించారు. మురుగు కాలువల మరమ్మతులు, వాటిపై పేరుకుపోయిన గడ్డిని తొలగించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఎంపీడీఓఆర్ శ్రీనివాసరావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు..

పార్థనా మందిరం ప్రారంభం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు నియోజక వర్గ పరిధిలోని వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు గ్రామంలో శనివారం షారోను ప్రార్థనా మందిరం పునాది కార్యక్రమం, నూతన ప్రారంభోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకకు సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి.ఎన్.విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు, నాగులుప్పలపాడు మండల అధ్యక్షులు తేళ్ల మనోజ్ కుమార్, పోతినేని శ్రీనివాసరావు, సంతనూతలపాడు ఎస్‌ఐ వేజెండ్ల అజయ్ బాబు, కనగాల శ్రీనివాసరావు, కొండ్రు దాసు, మారెళ్ళ కిరణ్ కుమార్, కుంకా చిన్నరావు, రంపతోటి అంకారావు, నల్లమల్లు సుబ్బారెడ్డి, కావూరి విజయ్ రాజ్, దుడ్డు వినోద్ కుమార్, పలువురు నాయకులు, సంఘ కాపరి పి.ఆండ్రూస్, సంఘ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


చిరువ్యాపారులకు తోపుడు బళ్లు అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి



చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేసిన డిఎస్‌పి

మంగళగిరి నియోజకవర్గానికి చెందిన ఇద్దరు చిరువ్యాపారులకు గివింగ్ బ్యాక్ టూ సొసైటీ సహకారంతో తోపుడు బళ్లు శనివారం అందజేశారు. ఉండవల్లి సెంటర్‌కు చెందిన కుక్కల దుర్గ, మంగళగిరి పట్టణం ఇందిరానగర్ కు చెందిన దామర్ల బాబురావులు చాలీ చాలని సంపాదతో అద్దె బండి భారంతో ఇబ్బందులు పడుతున్నారు. వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న గివింగ్ బ్యాక్ టూ సొసైటీ సాయం చేయాలన్న ఉద్దేశ్యంతో తోపుడు బళ్లను తయారు చేయించి డీఎస్పీ సి.హెచ్.మురళీకృష్ణ, తాడేపల్లి ఎమ్మార్వో సీతారామయ్య చేతుల మీదుగా అందజేయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సి.హెచ్.మురళీకృష్ణ మాట్లాడుతూ పేద ప్రజలకు గివింగ్ బ్యాక్ టూ సొసైటీ ద్వారా తోడ్పాటు అందించటం అభినందనీయమన్నారు. గివింగ్ బ్యాక్ టూ సొసైటీ ప్రతినిధులు తమ సంస్థ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవ కార్యక్రమాలు చేస్తూ పేద ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. సంతృప్తికరమైన జీవితాన్ని ఆస్వాదించడానికి ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయని పేర్కొన్నారు.



పదవలను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

'పదవల'కు అభినందనలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి రత్నాల చెరువులో ఇటీవల నూతనంగా తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులుగా నియమితులైన పదవల మహేష్‌ను శనివారం పలువురు దేశం తమ్ముళ్లు కలిసి అభినందించారు. రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్, నాయకులు మహేష్ ను శాలువాతో సత్కరించి, బొకే అందజేశారు. అనంతరం యాదవ్ మాట్లాడారు. టీడీపీలో మహేష్ వార్డు స్థాయి నుంచి నియోజకవర్గం స్థాయి వరకు పార్టీ బీసీ సెల్, తెలుగు యువత పదవులను సమర్థవంతంగా నిర్వహించడంతో మహేష్ సేవలను గుర్తించి మంత్రి లోకేష్ పార్టీ పట్టణ బాధ్యతలు అప్పగించడం హర్షనీయమన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి నాటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు నుంచి నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరకు బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గుంటూరు పార్లమెంటు పద్మశాలియ సాధికార సభ్యులు జొన్నాదుల బాలకృష్ణ, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు, ఎస్సీ సెల్ పట్టణ ఉపాధ్యక్షులు సింహాద్రి రామారావు, పట్టణ బీసీ సెల్ ఉపాధ్యక్షులు రుద్రు మురళి, నాయకులు నల్లగొర్ల శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిజి సెట్ ఫలితాల్లో జెకెసి విద్యార్థినికి రెండో ర్యాంక్

ప్రజాశక్తి-గుంటూరు



ఎపి పిజిసెట్ ఫలితాల్లో లైఫ్‌సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో జెకెసి కాలేజి డిగ్రీ మూడో సంవత్సరం విద్యార్థిని కామరాజు సాయి మురళిప్రియ రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించినట్లు కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా సాయిమురళిప్రియను శనివారం కళాశాలలో సెక్రెటరీతోపాటు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కె ప్రసాద్, ప్రిన్సిపాల్ గోపిచంద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సాంబశివరావు, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ హెఛ్ఒడి డాక్టర్ ఎం.గురవయ్య, అధ్యాపకులు అభినందించారు.



పోలీసు శాఖకు కారు బహూకరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా పోలీస్‌శాఖకు చలపతి విద్యాసంస్థల అధిపతి చలపతి ఆంజనేయులు శనివారం కారు బహూకరించారు. జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్‌కు, ఆంజనేయులు నాలుగు చక్రాల మహీంద్రా కారును అప్పగించారు. ఎస్‌పి సతీష్‌కుమార్ ఆంజనేయులుకు దన్యవాదాలు తెలిపారు. వాహనం యొక్క పత్రాలను, తాళాలను ఎస్‌పి అందించగా ఆయన ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు.

అన్న క్యాంటిన్లను నిరంతరం పర్యవేక్షించాలి

ప్రజాశక్తి-గుంటూరు



ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్

అన్నక్యాంటీన్లను నోడల్ అధికారులు ప్రతిరోజు పర్యవేక్షణ చేయాలని, క్యాంటీన్లలో నిర్దేశిత సమయానికి ఆహార సరఫరా జరగాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం ఆర్టీఓ ఆఫీస్ వద్ద ఉన్న అన్న క్యాంటిన్‌ను కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్లను నోడల్ అధికారులు ప్రతి రోజు పరిశీలించి, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు నిర్దేశిత సమయంలో ఆహారం అందించేలా, క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అక్షయపాత్ర సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. క్యాంటీన్లలో శుభ్రమైన త్రాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. క్యాంటీన్లలో ఆహార పదార్థాల నాణ్యత, సూచనలను క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తెలియచేయవచ్చని, క్యూఆర్ కోడ్ పై క్యాంటీన్ కి వచ్చే వారికి తెలియచేయాలన్నారు.

టిడిపి కంచుకోటను ఢీ కొంటాం

వైసిపి పశ్చిమ నియోజకవర్గ నూతన సమన్వయకర్త అంబటి రాంబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో పశ్చిమ నియోజకవర్గంలో వైసిపిని గెలిపించడమే లక్ష్యంగా పనిచేస్తానని నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త అంబటి రాంబాబు తెలిపారు. స్థానిక శ్రీనివాసరావుపేటలో శనివారం నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన పార్టీ నాయకులతో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటికి పలువురు నేతలు అభినందనలు తెలిపారు. తన రాజకీయ జీవితంలో చివరి మజిలీ గుంటూరు పశ్చిమలో ఉంటుందన్నారు. గత మూడు సార్లు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వైసిపి గెలవడం లేదని ఈసారి పార్టీ విజయం కోసం కృషి చేయాలన్నారు. అత్యంత టఫ్ గా ఉన్న పశ్చిమ నియోజకవర్గాన్ని గెలుచుకోవడమే మన టార్గెట్ అన్నారు. టిడిపి కంచుకోటను బద్దలు కొడతామన్నారు. తాను ఎప్పుడూ అవినీతికి పాల్పడలేదని, నిజాయితీగా రాజకీయాలు చేస్తానని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం నుండి పోటీ చేసే తనకు నియోజకవర్గ ప్రజలు ఆశీస్సులు కావాలని కోరుతున్నానని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో గతంలో ఓటమికి గల కారణాలపై పోస్టుమార్టం చేయాలన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం వల్ల ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందన్నారు. కూటమి పాలనలో అనేక అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. గుంటూరు నగర శివారు ప్రాంతంలో సింగయ్య అనే వైసిపి కార్యకర్త చనిపోతే దానిని రాజకీయం చేశారని తెలిపారు. టిడిపి సభ్యత్వం ఉన్న ఆ పార్టీ కార్యకర్త కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకతతో రప్ప రాప్ప అనే ఫ్లెక్సీ పట్టుకుంటే వైసిపికి ఆపాదించారని తెలిపారు. త్వరలో జిల్లాలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ అనే నినాదంతో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ విధానాలను ఎండగడతామన్నారు. ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, వైసిపి నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా, రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజ్ నారాయణ, రాష్ట్ర విద్యార్థి విభాగ అధ్యక్షులు పానుగంటి చైతన్య తదితరులు ప్రసంగించారు.



రాజధానిలో భూ లావాదేవీలు మందగమనం

వీక్షణం

రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులపై ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. సిఎం చంద్రబాబు నాయుడు, మునిసిపల్ మంత్రి పి.నారాయణ ఎప్పటికప్పుడు పలు అంశాలపై సమీక్షించి కీలక పనులకు ఆమోదం తెలుపుతున్నారు. ఈఏడాది మొత్తం రూ. 11,467 కోట్లతో చేపట్టనున్న పనులకు టెండర్లు ఖరారు అయ్యాయి. చాలా వరకు పనులు ప్రారంభించారు. పెండింగ్‌లో ఉన్న భవన సముదాయాల నిర్మాణాలు పూర్తి చేయడం, మాస్టర్ ప్లాన్ ద్వారా మౌలిక వసతులను కల్పించడం, రూ.2498 కోట్లతో సీడ్ కేపిటల్‌లో నిర్మించే 360 కిమీల ట్రంక్ రోడ్ల నిర్మాణం ప్రారంభించారు. రాజధాని గ్రామాల్లో ముంపు నివారణకు రూ. 1585 కోట్లతో పాల వాగు, కొండవీటి వాగు, గ్రావిటీ కెనాల్‌తో పాటు రిజర్వాయర్లు నిర్మాణం చేపట్టనున్నారు. గెజిటెడ్,నాన్ గెజిటెడ్,క్లాస్ - 4,అల్ ఇండియా సర్వీస్ అధికారుల భవనాలు పనులను రూ. 3523 కోట్లతో పనులు ప్రారంభించారు. రైతులకు ఇచ్చిన రిటర్ణబుల్ లే అవుట్ లలో రోడ్లు, మౌళిక వసతుల కల్పనకు రూ. 3859 కోట్లకు అనుమతి ఇచ్చారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ లోని 5 ఐకానిక్ టవర్లు,అసెంబ్లీ,హై కోర్టు భవనాలు డిజైన్లకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. 50 అంతస్తులతో ఐదు టవర్లు నిర్మాణ పనులకు కూడా శ్రీకారం చుట్టారు.

రైతులకు కేటాయించిన భూముల్లో మొత్తం 8496.30 ఎకరాల్లో మౌళిక వసతులను రూ. 3859.66 కోట్లతో పనులు చేపట్టారు. అనంతవరం, శాఖమూరు, నేలపాడు, తుళ్లూరు, అబ్బరాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, రాయపూడి, కొండమరాజుపాలెం తదితర గ్రామాల్లో రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్లుకు అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ఇంకా పలు అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మొత్తంగా రాజధాని నిర్మాణ పనులు వేగం పుంజుకోగా జిల్లా వ్యాప్తంగా భూ లావాదేవీలు మాత్రం మందగించాయి. రాజధాని గ్రామాల్లో భూముల క్రయ విక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. గత మూడు నెలలు రిజిస్ట్రేషన్లు పూర్తిగా మందగించాయి. జిల్లా వ్యాప్తంగా నాలుగునెలల క్రితం భారీగా జరిగిన లావాదేవీలు రెండో విడత భూ సమీకరణ చేస్తున్నట్టుగా ఫిబ్రవరి వార్తలు రాగానే మొత్తం విక్రయాలు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జిల్లాలో భూముల క్రయ విక్రయాలు పెరుగతాయని అంచనా వేసిన వారికి నిరాశ ఎదురయింది. టిడిపి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే రాజధాని అమరావతికి మళ్లీ పూర్వవైభవం వస్తుందని, తమ భూములకు ధరలు పెరుగుతాయని భావించిన రైతులకు ప్రస్తుతం నిరాశ మిగిలింది.. రెండో విడత భూ సమీ కరణకు 44 వేల ఎకరాలకు ప్రతిపాదనలు చేయడంతో జిల్లా అంతటా స్తబ్ధత ఏర్పడింది. అటు రాజధాని గ్రామాలు, ఇటు పరిసర మండలాల్లో కూడా ధరలు ఎక్కువగా ఉన్నందున కొనుగోలు జరగడం లేదని కొంత మంది చెబుతుండగా రెండో విడత సమీ కరణతో పూర్తిగా నిలిచిపోయాయని మరికొంత మంది రియల్టర్లు చెబుతున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయంకు 4,500 ఎకరాలు, వ్యాపార కార్యకలాపాలకు 2500 ఎకరాలు, రైల్వే లైను, ఇతర నిర్మాణాలకు మరో 3500 ఎకరాలు అవసరం అని అంచనా వేశారు. రాజధాని వెలుపల 44 వేల భూ సమీకరణ నిర్ణయంతో భూముల క్రయ విక్రయాలు పూర్తిస్థాయిలో మందగించాయి. గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు రాజధాని గ్రామాల్లో క్రయ విక్రయాలు ఉత్సాహంగా జరగ్గా ఫిబ్రవరి నుంచి క్రమంగా తగ్గుముఖం పట్టాయి. ప్రధానంగా అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వే లైన్లు, స్పోర్ట్సు స్టేడియం, పారిశ్రామిక వేత్తలకు భూముల కేటాయింపు కోసం మలి విడత సమీకరణకు నాలుగు రోజుల క్రితం మంత్రి వర్గం కూడా ఆమోదం తెలిపింది. ఏ ప్రాంతంలో భూములు తీసుకుంటారో... ఏ అభివృద్ధి పనికి ఏ ప్రాంతంలో భూములు అవసరమో తెలియక చాలామంది ప్రస్తుతం కొనుగోలును వాయిదా వేసుకుంటున్నారు. ఏయే ప్రాంతాల్లో ఏయే ప్రాజెక్టులు వస్తాయి. ప్రభుత్వం సమీకరణ ఏ ప్రాంతంలో ఎంత తీసుకుంటుందో తెలియడం లేదని రైతులు చెబుతున్నారు. దీని వల్ల తాము భూములు విక్రయంచుకోలేకపోతున్నామన అమరావతి, తాడికొండ మండలాల రైతులు వాపోయారు. మలివిడత భూ సమీకరణలపై గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని దాదాపు నాలుగు మండలాల్లోని 12 గ్రామాల్లో భూ సమీకరణకు అధికారులు మొదటి విడత గ్రామసభలను పూర్తి చేశారు. అయితే హైదరాబాద్‌లో భూ విక్రయాలు మందగించడం వల్ల ఆ ప్రభావం కూడా రాజధాని ప్రాంతంపై పడిందని మరికొందరు రియల్టర్లు చెబుతున్నారు. **(ఎ.వి.డి.శర్మ)**

ఈవిఎం గోడౌన్‌లో తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీలలో భాగంగా శనివారం గుంటూరు కలక్టరేట్ ఆవరణలోని ఇవియంలు భద్రపరిచిన గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. సిసిటివి పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. ఇవియంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.కార్యక్రమంలో డిఆర్‌ఓ షేక్.ఖాజావలి, గుంటూరు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, అడిషనల్ ఫైర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

జెడ్పీ పరిధిలో కారుణ్య నియామకాలు చేపట్టాలి

ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తూ, కరోనా సమయంలో మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబాలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ క్రింద కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. అమరావతి జేఏసీలోని సభ్యసంఘాల ఉమ్మడి గుంటూరు సమావేశం స్థానిక రెవెన్యూ భవన్‌లో శనివారం నిర్వహించారు. సమావేశానికి ఏపీజేఏసీ జిల్లా అధ్యక్షుడు కనపర్తి సంగీతరావు అధ్యక్షత వహించారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలతోపాటు ప్రభుత్వ వైద్యులు, టీచర్లు, వివిధ శాఖల ఉద్యోగులు మరణించారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2744 మంది ప్రభుత్వ ఉద్యోగులు మరణిస్తే 1488 మందికి ఉద్యోగాలు కల్పించిందన్నారు. ప్రభుత్వం మిగిలిన వారికి వన్‌టైమ్ సెటిల్ మెంట్ కింద కారుణ్య నియామకాలు ఇవ్వాలని ఏపీ జేఏసీ అమరావతి విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం 2023 జులైలో కారుణ్య నియామకాలు చేపట్టిందన్నారు. దీంతోపాటు ఆర్టీసీలో మరణించిన 1200 మంది ఉద్యోగుల కుటుంబాలకూ సచివాలయాల్లో నియామకాలు ఇచ్చారన్నారు. అయితే ఇదే క్రమంలో జెడ్పీ యాజమాన్య పరిధిలోని టీచర్లకు సంబంధించి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. 4, 5 సంవత్సరాలుగా కారుణ్య నియామకాలు లేక మృతి చెందిన టీచర్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. స్థానిక సంస్థలకు ఆయా శాఖల్లోనే కారుణ్య నియామకాలు జరపాలనే నిబంధనల వల్ల, తగిన ఖాళీలు లేక నియామకాలు ఆగిపోయాయన్నారు. గురువుల పాత్రలో ఉండి మంచి సమాజాన్ని నిర్మించే వారి కుటుంబాల జీవన స్థితి నేడు దీనంగా మారిందని చెప్పారు. సంక్రాంతి సమయానికల్లా జెడ్పీ పరిధిలోని టీచర్లకు కారుణ్య నియామకాలు చేపడతామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పటి అమలు జరగకపోవడంతో ఆయా కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని వివరించారు. రాష్ట్రంలో జెడ్పీ పరిధిలోని మరణించిన టీచర్ల విషయంలో 2013లో విడుదల చేసిన మెమోను సవరించి వన్ టైమ్ సెటిల్మెంట్ కింద ఖాళీలు ఉన్న ఇతర ప్రభుత్వ శాఖల్లో కారుణ్య నియామకాలు చేపట్టి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్‌రావు, రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ పారె లక్ష్మి, నాయకులు పి.విజయలక్ష్మి, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటరాజేష్, సిటీ జేఏపీ చైర్మన్ రవి ప్రసాద్, కో ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, ఎపిఆర్ఎస్ఎ జిల్లా అధ్యక్షులు కిరణ్‌కుమార్, అవుట్‌సోర్సింగ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుబాబు పాల్గొన్నారు.